సాక్షి
మహబూబాబాద్

గురువారం । 9 । జనవరి । 2025



హ్యాపీ జర్నీ..
సంక్రాంతి పండుగకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వరంగల్ రీజియన్‌లో వివిధ రూట్లలో 660 ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. - 8లో▸



ఎంటర్ ది ఎన్‌క్లోజర్స్ ఎప్పుడో..
వరంగల్ నగరంలోని జూ పార్క్‌లో పులులు, దున్నలను చూసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎన్‌క్లోజర్లను ఎప్పుడు ప్రారంభిస్తారోనని సందర్శకులు ఎదురుచూస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28.3°/16.1°

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రి వేళ చలితో పాటు మంచు పడుతుంది.

న్యూస్‌రీల్

ముగిసిన శిక్షణ



కేసముద్రం: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నేల, నీటి సంరక్షణపై ఏఈఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం రెండోరోజు బుధవారం ముగిసింది. హైదరాబాద్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో వలంటరీ డైరెక్టర్ విజయగౌరీ, డీఏఓ విజయనిర్మల పలు అంశాలపై వివరించారు. అనంతరం శిక్షణ పొందిన జిల్లాలోని ఏఈఓలకు ట్రెనింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీహెచ్‌ఎస్‌ఓ మరియన్న, ఏడీఏ శ్రీనివాసరావు, కేవీకే మల్యాల శాస్త్రవేత్త క్రాంతి, వలంటరీ ఏడీఏ సునీత, అన్నపూర్ణ, ఏఓ వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు మంజూరు చేయాలి



మహబూబాబాద్ అర్బన్: సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న సాధారణ సెలవు ప్రకటించాలని గోర్‌సేన రాష్ట్ర కోశాధికారి బోడ హరిలాల్ నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు బుధవారం గోర్‌సేన రాష్ట్ర నాయకులు వినతిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమలో నాయకులు రమేష్ నాయక్, బాబురావు నాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసులు

మహబూబాబాద్ అర్బన్: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వర్సటైల్ హైస్కూల్‌లో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తెలుసుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించొద్దని, తెలిసి తెలియని డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారులు సాయిచరణ, వెంకట్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఖలీద్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ఔషధాలు అమ్ముతున్న ఒకరి అరెస్ట్

ఎంజీఎం: వరంగల్ పోస్టాఫీస్ సమీపంలోని గుడ్ హెల్త్ మెడికల్ షాపులో డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు, ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన మత్తు ట్యాబెట్లను ప్రిస్క్రిప్షన్ లేకుండా యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించి.. నిషేధిత ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మందుల షాపు యజమానిని అదుపులోకి తీసుకుని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఆర్‌ఐ శివకేశవులు, వరంగల్ డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ అరవింద్‌కుమార్, ఆర్‌ఎస్సై పూర్ణ, డ్రగ్ కంట్రోల్ పోలీసులు, డ్రగ్ కంట్రోల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గట్టమ్మ హుండీల లెక్కింపు

ములుగు రూరల్: ములుగు జిల్లా కేంద్రంలో గట్టమ్మ ఆలయ హుండీల లెక్కింపు ప్రక్రియను దేవాదాయశాఖ అధికారులు బుధవారం చేపట్టారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఈఓ బిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గట్టమ్మ హుండీల ద్వారా ఆదాయం రూ.1,93,838 వచ్చిందని తెలిపారు. ఇందులో రూ.1,81,555 నోట్ల రూపంలో లభించగా రూ.12,283 నాణేల రూపంలో వచ్చాయని తెలిపారు. దేవాదాయ శాఖ పరిశీలకులు కవిత, పూజారుల లక్ష్మయ్య, ఆర్‌ఐ యుగేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పుష్కరాలపై సమీక్ష

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో నిర్వహించే కుంభాభిషేకం, సరస్వతినది పుష్కరాలపై దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అధ్యక్షతన శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఈఓ మారుతి బుధవారం తెలిపారు. కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి క్షేత్రస్థాయిలో కాళేశ్వరం దేవస్థానాన్ని సందర్శించి సమీక్షలో పాల్గొంటారని తెలిపారు. ఫిబ్రవరిలో మహాశివరాత్రికి ముందే శృంగేరి పీఠాధిపతి, అతడి శిష్య బృందంతో కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 15న జరిగే సరస్వతి నది పుష్కరాల ఏర్పాట్లపై చర్చించి ప్రణాళికలు చేయనున్నారు.



పరీక్షలు ఎప్పుడంటే..
ఇంటర్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 3వ తేదీనుంచి, పబ్లిక్ పరీక్షలు మార్చి 5వ తేదీనుంచి, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21వ తేదీనుంచి ప్రారంభమవుతాయి.

ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు ఇలా..



'పరీక్ష' కాలం.. ప్రణాళికతో విజయం

సమీపిస్తున్న టెన్త్, ఇంటర్ పరీక్షలు

- విద్యార్థుల సన్నద్ధతపై టీచర్లు, లెక్చరర్ల దృష్టి
- ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

విద్యారణ్యపురి: పరీక్షలు సమీపిస్తున్నాయి. టెన్త్, ఇంటర్ విద్యార్థులు చదువుల్లో మునిగిపోయారు. ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి, టెన్త్.. మార్చి 21 నుంచి జరగనున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల విద్యా సంస్థలు ప్రత్యేక దృష్టిసారించాయి. ఈనేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా చదివితే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు, అధ్యాపకులు చెబుతున్నారు.

90 రోజుల ప్రణాళిక



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధి కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు 90 రోజుల ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన కొనసాగుతోంది. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ రూపొందించినట్లుగా ప్రతీ కళాశాలలో సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి బోధిస్తున్నారు. స్టడీ అవర్స్, యూనిట్ టెస్టులు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన కొనసాగుతోంది. ఈనెల 20 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. కొన్నిచోట్ల సబ్జెక్ట్ సిలబస్ పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల రివిజన్ క్లాసులు కొనసాగుతున్నాయి. కాగా.. విద్యాబోధనను పర్యవేక్షించేందుకు ఇంటర్ బోర్డ్ ఉమ్మడి జిల్లాకు నియమించిన అబ్జర్వర్ (ఇంటర్మీడియట్ బోర్డ్ డిప్యూటీ సెక్రటరీ) టి.యాదగిరి మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలలను పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. అత్యధిక ఉత్తీర్ణత సాధించేలా సూచనలిచ్చారు.

స్పెషల్ క్లాసులు..

ఉమ్మడి జిల్లాలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యను బోధిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల బాగా చదివే విద్యార్థులను గుర్తించి వారికి 10/10 జీపీఏ వచ్చేలా కృషి చేస్తున్నారు. పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా సూచనలు చేస్తున్నారు.

సూచనలివే..

- పరీక్షలు అంటే భయం ఉండకూడదు. సమయాన్ని వృథా చేయకుండా సబ్జెక్టుల వారీగా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- సిలబస్ పూర్తయ్యిందని ఇంటి వద్దే ఉండొద్దు. తరగతులకు హాజరైతే పునఃశ్చరణ, సందేహాల నివృత్తి జరుగుతుంది. స్టడీఅవర్స్‌లో ప్రత్యేక శ్రద్ధతో చదువుకునే అవకాశం పాఠశాలలు,కళాశాలల్లో ఉంటుంది.
- పాత ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేస్తే పరీక్ష పద్ధతులు తెలుస్తాయి.
- పిల్లలు చదువుతున్నారా లేదా అని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. వారి చదువుకు సహకరించాలి.
- ఆత్మవిశ్వాసం పెంచడం.. ఒత్తిడి లేకుండా పిల్లలను ప్రోత్సహించి, వారి ప్రగతిని ప్రశంసించడం.
- భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, మ్యాథమెటిక్స్‌లోని భావనలు నేర్చుకోవడం.
- సూత్రాలు, సిద్ధాంతాలు అవగాహన: ముఖ్యమైన సిద్ధాంతాలను బాగా అర్థం చేసుకోవడం.
- ప్రయోగాలు, పటాలు, ఉదాహరణలు, అప్లికేషన్లు ప్రాక్టీసు చేయాలి.
- విద్యార్థులు చదువుతున్నప్పుడు మధ్య మధ్యలో కొంత సేపు విశ్రాంతి తీసుకోవాలి.

ఆరోగ్యమూ ముఖ్యమే..




- ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. అదేవిధంగా ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం తీసుకోవాలి.
- పరీక్షలు ముగిసే వరకు మాంసాహారం జోలికి వెళ్లకపోవడం మంచిది. అదేవిధంగా జంక్‌ఫుడ్స్, బయటి ఆహారం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలి.
- కనీసం రోజు 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. రోజూ ఉదయం, సాయంత్రం కొంత సమయం యోగా, ధ్యానం వంటివి చేస్తే ఆక్సిజన్ పూర్తిస్థాయి అంది మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- రోజూ గంటల తరబడి ఒకే దగ్గర కూర్చొని చదవకుండా.. మధ్యమధ్యలో కాసేపు విరామం ఇవ్వాలి. కొద్దిసేపు ఇంట్లోనే అటు, ఇటు తిరిగితే రిలాక్స్‌గా ఉంటుంది.

ఇవి దూరంగా పెట్టండి..



- ఏకాగ్రతను దెబ్బతీసే టీవీ, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి. మొబైల్‌ఫోన్లలో గేమ్స్ ఆడడం వంటివి చేయొద్దు.
- సినిమాలకు, అనవసర ఫంక్షన్లకు, విందులు వినోదాలకు దూరంగా ఉంటే మంచిది.
- చదువు విషయంలో రేపు చూద్దాం.. గంట తరువాత చదువుదాంలాంటి బద్ధకం, నిర్లక్ష్యం వహించద్దు.
- తమ సహచర విద్యార్థులతో వివిధ సబ్జెక్టుల్లోని విషయాలను చర్చించాలి కానీ.. సంబంధంలేని విషయాలను వదిలేయాలి.

పరీక్ష రాసే సమయంలో..



- **ప్రశ్నలను పూర్తిగా చదవడం:** ప్రశ్నలను అర్థం చేసుకుని సమాధానం ఇవ్వండి.
- సమర్థంగా సమాధానం రాయాలి. ప్రశ్నల ప్రాధాన్యాన్ని గుర్తించి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- **రివిజన్:** సమాధానాలను తిరిగి చూసి, తప్పులను సరిచేసుకోవాలి.

మరింత సహకారం

కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు

- నూతన మండలాలు, మారుమూల ప్రాంతాలకు విస్తరణ
- జిల్లాలో ఎనిమిది పీఏసీఎస్‌ల ప్రతిపాదనలు
- పరిగణనలోకి 45 అంశాలు
- కసరత్తు ప్రారంభించిన అధికారులు



సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ పథకాలు మరింత చేరువలోకి తీసుకొచ్చేందుకు పీఏసీఎస్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, ఇతర సబ్సిడీ పరికరాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇందుకోసం 45 అంశాలను పరిగణనలోకి తీసుకొని కొత్త సంఘాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు.

జిల్లాలో ఎనిమిది కొత్త సంఘాలు..
ఉమ్మడి జిల్లాలో ప్రతీ మండల కేంద్రంతో పాటు పలు మారుమూల ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ద్వారా పాలకవర్గాలను ఎన్నుకుంటారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం జిల్లాలు, డివిజన్లు, మండలాలు, కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. దీనికి అనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల విస్తరణ జరగలేదు. దీంతో పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటి వరకు జిల్లాలో 19 సంఘాలు ఉండగా.. ప్రస్తుతం మరో ఎనిమిది కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

45 అంశాల్లో పరిశీలన..
కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు 45 అంశాలను పరిశీలించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఇందులో ప్రధానంగా ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌కు కొత్త పీఏసీఎస్‌కు మధ్య దూరం కనీసం 10కిలో మీటర్లకు పైగా ఉండాలి. విభజనలో కొత్త పీఏసీఎస్ పరిధిలోకి ఎన్ని గ్రామాలు వెళ్తున్నాయి. సభ్యులు ఎంత మంది, కొత్త సంఘం ఏర్పాటుకు ఉద్యోగులు ఎంత మంది అవసరం, కార్యాలయం ఏర్పాటుకు ఖర్చు ఎంత అవుతుంది.. ఎంత సాగు భూమి ఉంటుంది. సీజన్ వారీగా ఎరువులు, విత్తనాలు, ఇతర సబ్సిడీ పరికరాల పంపిణీ, టర్నోవర్ ఎంత.. ఇలా మొదలైన అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధం అవుతున్నారు.

పీఏసీఎస్‌ల వివరాలు..
- జిల్లాలో మొత్తం పీఏసీఎస్‌లు: 19
- సహకార బ్యాంకులు: మరిపెడ, తొర్రూరు, గార్ల, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు
- కొత్తగా ఏర్పాటు చేసే పీఏసీఎస్‌లు: కొత్తగూడ, గంగారం, అప్పరాజుపల్లి, అయోధ్యపురం, దంతాలపల్లి, చిన్నగూడూరు, ఇనుగుర్తి, రాంపురం(గార్ల మండలం)

రైతుకు చేరువలో..
కొత్తగా ఏర్పాటు చేసే పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు ప్రభుత్వం అందజేసే పథకాలు చేరువలోకి వస్తాయి. ఇప్పటి వరకు ఉన్న 19 సంఘాల పరిధిలో 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగూడ మండలంలో పొగుళ్లపల్లి పీఏసీఎస్‌కు తోడుగా కొత్తగూడ, గంగారం ప్రాంతాల్లో, గూడూరు పీఏసీఎస్ పరిధిలోని అప్పరాజుపల్లి, అయోధ్యపురం, గార్ల సంఘం పరిధిలోని రాంపురం, కొత్తగా ఏర్పడిన దంతాలపల్లి, చిన్నగూడూరు, ఇనుగుర్తి ప్రాంతాల్లో మొత్తం ఎనిమిది కొత్త సంఘాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో రైతులకు సౌకర్యంగా ఉండటం, పరిపాలనా పరమైన ఇబ్బందులు తొలగనున్నాయి.

మందుబత్తాలకు ఇబ్బంది అవుతుంది



పొగుళ్లపల్లి పీఏసీఎస్‌కు పోయి విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవాలంటే ఇబ్బంది అవుతుంది. కొత్తగూడలో ఇంతకు ముందు రైతు సంఘం ఉండేది. దానిని తీసేసింద్రు. ఇప్పుడు మళ్లీ పీఏసీఎస్ పెట్టాలి. దగ్గరలో ఉన్న సంఘానికి పోయి అన్ని తెచ్చుకుంటాం.


- మల్లెల శ్రీహరి, కొత్తపల్లి, కొత్తగూడ మండలం

రైతులకు సౌకర్యంగా ఉండాలి



ఇంతకు ముందు ఆగపేటలో పీఏసీఎస్ ఉండేది. దానిని రద్దు చేసింద్రు. మా పాత మండలంలో పీఏసీఎస్ ఉంది. మండలం మారింది. పీఏసీఎస్ కూడా మారితే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. రైతులు ఇబ్బంది పడకుండా ఎరువులు, విత్తనాలు తెచ్చుకుంటారు. **- గుండాల అయిలయ్య, దాట్ల, దంతాలపల్లి మండలం**

అయోధ్యపురంలో ఏర్పాటు చేయాలి



అయోధ్యపురంలో పీఏసీఎస్ ఏర్పాటు చేస్తే గాజుల గట్టు, మదనాపురం, గుండెంగ, పొనుగోడు, రాములు తండా, నాయకపల్లి, తీగలవేణి, బొల్లెపల్లి గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. గతంలో రైతు సహకార సొసైటీల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు, రుణాలు, వ్యవసాయ పనిముట్లు లభించేది. ఇక్కడ పీఏసీఎస్ ఏర్పాటు చేస్తే తిరిగి మళ్లీ రైతులకు అలాంటి సేవలు లభిస్తాయి.

- నలమాస యాకయ్య గౌడ్, రైతు, అయోధ్యపురం, గూడూరు మండలం

ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నాం



రైతులు, ప్రజాప్రతినిధుల కోరిన విధంగా జిల్లాలో కొత్తగా ఎనిమిది పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు అన్ని వివరాలు తెలుపుతూ.. కొత్త సంఘాల ఏర్పాటు అవసరాన్ని కూడా వివరించి చెబుతున్నాం.

- వెంకటేశ్వర్లు, డీసీఓ, మహబూబాబాద్

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

మహబూబాబాద్ అర్బన్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధనశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడుతాయని తెలిపారు. మహిళలకు అధికంగా వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని, వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న భూమిని గుర్తించాలన్నారు. సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. కేంద్ర పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందని, ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీఎఫ్‌ఓ బి.విశాల్, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ నరేష్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దేశిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: దేవాలయాల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి నియోజకవర్గ పరిధిలోని దేవాదాయ ధర్మాదాయ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వల్మిడి సీతారామచంద్రస్వామి అభివృద్ధి పనులపై శ్రద్ధ వహించాలని, స్మృతి వనం అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని, దేవరుప్పుల మండలం కడవెండి వానకొండయ్య గుట్ట, చెన్నూరు ఆలయాల అభివృద్ధి పనులకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపించాలన్నారు. బమ్మెర పోతన, సోమేశ్వరాలయం, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి ఆదాయ వనరులు మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పాలకుర్తి సోమేశ్వర ఆలయంలో ఆలయ సిబ్బంది పనితీరు సరిగా లేదని, పద్ధతి మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పీఎం కుసుమ్'ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ పోచం, పక్కన అధికారులు

- ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం

ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎం కుసుమ్ పథకాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా ఆదేశాల మేరకు ఏటూరునాగారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పీఎం కుసుం పథకంపై పెసా మొబిలైజర్లకు అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లను పెట్టేందుకు పక్కా ప్రణాళికను కేంద్రం చేపడుతుందన్నారు. అందులో భాగంగానే 4ఎకరాల భూమి కలిగి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా లేదా రెవెన్యూ పట్టా కలిగి ఉండాలన్నారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్‌కి ఐదు కిలోమీటర్ల దూరంలోని భూములను 25 సంవత్సరాల పాటు లీజుకు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆ భూములకు ఏడాదికి ఎకరానికి రూ.12,500 చెల్లించనున్నట్లు తెలిపారు. ఆ భూమిలో సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా నెలకొల్పిన సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకంపై ఆసక్తి కలిగిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ లేదా రెవెన్యూ పట్టా కలిగిన రైతులు మరిన్ని వివరాల కోసం ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఏఓ రాజ్‌కుమార్, ఏటీడీఓ క్షేత్రయ్య, తహసీల్దార్ జగదీశ్వర్, ఎస్‌ఓ సురేష్‌బాబు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ అనిల్, ఏఈ అశోక్ పాల్గొన్నారు.

చెత్తను మున్సిపల్ బండిలో ఎత్తిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు



చెత్త తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కార్మికులు తొలగించారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించారు. జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లలో చెత్తాచెదారం తొలగించడంతోపాటు కాల్వల పూడిక తీయించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మానుకోట మున్సిపల్ పరిధిలో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాల్లో వేయవద్దని సూచించారు. మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు సైడ్ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

నెహ్రూసెంటర్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆకుల రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే దేశ భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. అదానీ, అంబానీలకు వేల కోట్ల రూపాయల మాఫీలు, రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ రాజ్యాంగాన్ని రద్దు చేసి హిందుత్వాన్ని అమలు చేయాలని భావిస్తోందని ఆరోపించారు. రాష్ట్రాల ప్రత్యేక అధికారాలు, ఉనికిని దెబ్బతీసేందుకు దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా అందించి రైతులను ఆదుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సోమయ్య, వీరయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

10 నుంచి జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జాతీయస్థాయి మెన్ అండ్ ఉమెన్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రిక్కల శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజులు జరగనున్న ఈ పోటీల్లో దేశంలోని 28 రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు, 30 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరవుతారని తెలిపారు. పోటీలు టీం, రేగో, కార్డ్, డబుల్స్ విభాగాల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో కొనసాగుతాయని తెలిపారు. జేఎన్ స్టేడియంలోని హ్యాండ్‌బాల్, ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

బస్తాలో 45 కిలోల మిర్చి ఉండాలి



మిర్చి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు, చాంబర్ ప్రతినిధులు

వరంగల్: మార్కెట్‌కు బస్తాలో 45 కిలోల కంటే ఎక్కువ మిర్చి తీసుకురావొద్దని, ఎక్కువ బరువుతో తీసుకొస్తే నాణ్యతా ప్రమాణాలు దెబ్బతింటాయని మార్కెటింగ్ శాఖ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం యార్డును సందర్శించి రైతులు తీసుకొచ్చిన మిర్చిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తేమ ఎక్కువగా లేకుండా పంటను రైతులు పొలంలోనే ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావాలన్నారు. అలా తీసుకొచ్చిన పంటకు గిట్టుబాటు ధర పలుకుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, అడ్తి, మిర్చి సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- 7 నుంచి 13వ తేదీ వరకు వివిధ రూట్లలో 660 ప్రత్యేక బస్సులు
- ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సేవలు

హ్యాపీ జర్నీ..



హన్మకొండ : సంక్రాంతి.. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగ. ఈ పర్వదినానికి ఉద్యోగం, ఉపాధి రీత్యా, ఉన్నత చదువు కోసం, పొట్టకూటి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు కచ్చితంగా స్వగ్రామాలకు వస్తారు. ఈ క్రమంలో ఒకేసారి ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమస్యను అధిగమించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లో వివిధ రూట్లలో 660 ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం..

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. మహిళలతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా ప్రయాణిస్తారనే ఆలోచనతో అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఒకేసారి ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణతో బస్సులు నడపుతోంది.

వరంగల్ రీజియన్‌లో 9 ఆర్టీసీ డిపోలు..

వరంగల్ రీజియన్‌లో 9 ఆర్టీసీ డిపోలున్నాయి. డిపోల వారీగా అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ప్రయాణికులకు నిరీక్షణ ఉండకుండా ఎప్పటికప్పుడు బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. హనుమకొండ నుంచి ఉప్పల్ (హైదరాబాద్), పరకాల, భూపాలపల్లి, కాళేశ్వరం, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, జనగామకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఇతర రూట్లలో ప్రయాణికుల రద్దీ ఉంటే ఆ రూట్‌లలో అదనపు బస్సులు నడుపుతున్నారు. ఈసారి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో ఉండడంతో కొరత సమస్య ఉత్పన్నం కావడం లేదు.

డిపోల వారీగా ప్రత్యేక బస్సులు

డిపో	ప్రత్యేక బస్సులు
హనుమకొండ	90
జనగామ డిపో	90
వరంగల్–1	192
వరంగల్–2	292
మహబూబాబాద్	56
నర్సంపేట	56
పరకాల	56
తొర్రూరు	74
భూపాలపల్లి	54

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

సాధారణంగా హైదరాబాద్ ఉప్పల్ నుంచి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ మేరకు ఉప్పల్ బస్ పాయింట్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టెంట్లు, షామియానాలు, తాగునీరు సౌకర్యం కల్పించారు. వివిధ జాతరల దృష్ట్యా హనుమకొండ నుంచి కొత్తకొండకు, వరంగల్ నుంచి ఐనవోలుకు, జనగామ నుంచి కొమరవెల్లికి పండుగ రోజుల్లో ప్రత్యేక బస్సులు నడుపుతారు. కాగా, ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీఎస్‌ఆర్‌టీసీ బస్. ఇన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలి.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు



సంక్రాంతి పండగకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సుఖవంతం, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.

డి.విజయ భాను, ఆర్టీసీ వరంగల్ రీజనల్ మేనేజర్

నగరంలో మహిళా దొంగలు

అత్త, ఇద్దరు కోడళ్లు చెత్త సేకరణకు వచ్చి చోరీలు

- తాళాలు వేసి ఉన్న ఇళ్ల టార్గెట్..
- సీసీ ఫుటేజీతో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



స్వాధీనం చేసుకున్న సొత్తు చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి: ఇప్పటి వరకు పురుషులే చోరీలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడుతుండగా, ఇప్పుడు కొత్తగా మహిళలు కూడా చోరీలకు తెరలేపారు. చెత్త సేకరణకు వచ్చి తాళాలు వేసి ఉన్న ఇళ్లు టార్గెట్‌గా చోరీలు చేస్తూ పోలీసులకు చిక్కారు. కేయూ పీఎస్ పరిధిలో ఇటీవల జరిగిన చోరీల ఘటనలో ముగ్గురు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు ఆ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పీఎస్ పరిధిలోని విజయ్‌నగర్‌కాలనీకి చెందిన సయ్యద్ ఆసిఫ్ ఇంట్లో నాలుగు రోజుల క్రితం చోరీ జరిగింది. ఈ ఘటనలో 18 తులాల బంగారంతోపాటు పెద్ద మొత్తంలో నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్,ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ముగ్గురు మహిళలు ఘటన జరిగిన ప్రదేశంలోని ప్రహరీలు దూకుతున్నట్లు గుర్తించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈమేరకు భీమారంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు మహిళలు పోలీసులకు పట్టుబడ్డారు.

చోరీలు చేస్తున్న అత్త, ఇద్దరు కోడళ్లు..

ఆ ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలోని శివనగర్‌కు చెందిన అత్తాకోడళ్లు కడమంచి లచ్చమ్మ, తూర్పాటి రాజీమేరి, పర్వతం కనకలక్ష్మిగా తేలింది. వీరు చెత్త సేకరణ కోసం వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తాళాలు ఉన్న ఇళ్లు టార్గెట్ చేసుకుంటున్నారని ఏసీపీ దేవేందర్‌రెడ్డి చెప్పారు. కాగా, విజయ్‌నగర్ కాలనీలోకి ఓ ఇంట్లో చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించారని ఏసీపీ దేవేందర్‌రెడ్డి చెప్పారు. వీరిని రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో చెత్త సేకరణ కోసం వచ్చే వారి ఫొటోలను తీయాలని ఏసీపీ చెప్పారు.

10న ఉత్తర ద్వార దర్శనం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం రామాలయంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా 10వ తేదీన (శుక్రవారం) ఉత్తరద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎ.మారుతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30గంటలకు ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మహదేవపూర్ మండలం మందరగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా 10వ తేదీన ఉదయం 4.30గంటలకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు అర్చకుడు నవీన్‌చారి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.



ఎంటర్ ది ఎన్‌క్లోజర్స్ ఎప్పుడో..

నెల నుంచి బోనులో బందీలుగా పులులు

- దున్నలు, జింకల పరిస్థితీ అంతే..
- మంత్రి సురేఖ సమయం కోసం సాగదీత
- సెలవుల్లోనైనా సందడి చేస్తాయా?
- ప్రశ్నిస్తున్న సందర్శకులు



రిలాక్సేషన్ కోసం బోనులో నుంచి బయటికి వస్తున్న మగపులి



జూపార్కులోని బోనులో బేల చూపులు చూస్తున్న అడవి దున్న

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని జూపార్క్‌కు హైదరాబాద్ నెహ్రూ జూవాలజికల్ పార్క్ నుంచి బెంగాల్ టైగర్లు (శంకర్, కరీనా), బైసన్స్(అడవి దున్నలు), విశాఖపట్నం నుంచి హగ్ డీర్, బార్కిన్ సన్ డీర్(జింకలు) తీసుకొచ్చి నెల రోజులైంది. కానీ వాటిని బోన్లలోనే ఉంచుతున్నారు. వీటి కోసం సిద్ధం చేసిన ఎన్‌క్లోజర్ల ప్రారంభానికి జిల్లా మంత్రి కొండా సురేఖకు సమయం కుదరకపోవడంతో పులి, దున్నలను చూసే అవకాశం ఎప్పుడా? అని పర్యాటకులు ఎదురుచూస్తున్నారు.

బందీలుగా బెంగాల్ టైగర్స్..

టైగర్లు, బైసన్లను సందర్శకులు చూసేందుకు ప్రత్యేక ఎన్‌క్లోజర్లను సిద్ధం చేశారు. రెండు పులులకు కలిపి ఒకటి, బైసన్లకు మరోటి ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేశారు. వీటిని పకడ్బందీగా నిర్మించారు. కానీ.. నెల రోజులుగా టైగర్స్ బందీలుగా ఉంటున్నాయి. పులులను నిరంతరం బోన్‌లో ఉంచితే ఆరోగ్యం చెడిపోయే అవకాశం ఉంటుంది. దీంతో పశువైద్యాధికారుల సూచన మేరకు ఉదయం పూట కరీనా (ఆడ పులి), మధ్యాహ్నం శంకర్(మగ పులి)ని గంటపాటు ఎన్‌క్లోజర్‌లో తిరిగేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సంక్రాంతి సెలవుల్లోనైనా వీటిని అందుబాటులోకి తీసుకురావాలని సందర్శకులు కోరుతున్నారు.



పులిని ఫొటోలు తీస్తున్న సందర్శకులు

మంత్రి చేతుల మీదుగా ప్రారంభం



జూపార్క్‌లో జంతువుల ఎన్‌క్లోజర్స్‌తో పాటు ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 11న సమయమిచ్చారు. పర్యటన ఖరారు కాగానే సమాచారం ఇస్తాం.

– బి.లావణ్య, జిల్లా అటవీశాఖ అధికారి, హనుమకొండ



పులుల కోసం సిద్ధం చేసిన ఎన్‌క్లోజర్

వాయిదాలతో సాగదీత..

వరంగల్ జూపార్క్‌లో ఎన్‌క్లోజర్స్ ప్రారంభానికి మంత్రి కొండా సురేఖ సమయమిచ్చినా అత్యవసర సమావేశం కారణంగా ఓసారి వాయిదా పడింది. మరోసారి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణంతో ఏడు రోజులు రాష్ట్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించడంతో పర్యటన ఖరారు కాలేదు. ఈనెల ఎనిమిది లేదా పదో తేదీన పర్యటన ఖరారు అయ్యిందని అనుకుంటున్న తరుణంలో స్థానిక పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్థానికంగా లేకపోవడంతో 11వ తేదీకి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఆ రోజు అయినా ఎన్‌క్లోజర్స్ ప్రారంభానికి ముహూర్తం వస్తుందా? పులులు బోనులోనుంచి బయటికి వచ్చి సందడి చేస్తాయా? అని సందర్శకులు అంటున్నారు.

వ్యాపారిని బురిడీ కొట్టించిన ఆగంతకుడు

- కొత్త సెల్‌ఫోన్‌తో పరారీ
- డోర్నకల్‌లో ఘటన

డోర్నకల్: డోర్నకల్‌కు చెందిన పద్మావతి సెల్‌పాయింట్ యజమానిని ఓ ఆగంతకుడు బురిడీ కొట్టించాడు. కొత్త సెల్‌ఫోన్‌తో ఉడాయించాడు. బాధితుడి కథనం ప్రకారం.. పద్మావతి సెల్‌పాయింట్ యజమాని అభిషేక్‌జైన్ సెల్‌కు గత నెల 20వ తేదీన 9010675674 నంబర్ నుంచి కాల్ వచ్చింది. తన పేరు శ్రీనివాసరావు, రైల్వే స్టేషన్‌లో జీఈగా విధులు నిర్వహిస్తున్నానని, తనకు కొత్త మోడల్ సెల్‌ఫోన్ కావాలని కోరగా అడ్వాన్స్ ఇస్తే ఆర్డర్ చేస్తానని అభిషేక్ తెలిపారు. తరువాత ఇదే నంబర్ నుంచి వాట్సాప్ ద్వారా తనకు కావాల్సిన ఫోన్ మోడల్ వివరాలు పంపి ఇతర నంబర్ నుంచి రూ.వెయ్యి అభిషేక్‌కు ఫోన్‌పే ద్వారా పంపాడు. మంగళవారం మరోసారి ఫోన్ చేసి ఈ రోజే తనకు ఫోన్ కావాలని కోరాడు. దీంతో అభిషేక్ ఖమ్మం నుంచి రూ.35 వేల విలువైన సెల్‌ఫోన్ తెచ్చి సదరు నంబర్‌కు ఫోన్ చేయగా రైల్వే స్టేషన్‌కు తేవాలని సూచించాడు. అభిషేక్ ఫోన్‌తో స్టేషన్‌కు వెళ్లగా రన్నింగ్ స్టాఫ్ యూనిఫాం ధరించిన వ్యక్తి వచ్చి జీఈ పక్క గదిలో ఉన్నారంటూ చెప్పగా అభిషేక్ విశ్రాంతి రూంలో కూర్చున్నాడు. కొద్ది సమయం తరువాత అభిషేక్ ఫోన్‌కాల్‌లో మాట్లాడుతుండగా అదే వ్యక్తి వచ్చి అభిషేక్ చేతిలోని కొత్త సెల్‌ఫోన్‌ను తీసుకుని పక్క గదికి వెళ్లాడు. తరువాత రాకపోవడంతో అభిషేక్ అతడి కోసం వెతకగా కనిపించలేదు. దీనిపై స్టేషన్ మాస్టర్‌తో పాటు సిబ్బందిని విచారించగా అలాంటి వ్యక్తులెవరూ లేరని చెప్పడంతో తాను మోసపోయానని గుర్తించి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహబూబాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఇటీవల ఈ తరహా మోసాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

అమ్మకానికి కలదు

■ Restaurant / హోటల్ అమ్మకానికి కలదు. కిట్స్ కాలేజి ప్రక్కన, ఎర్రగట్టు గుట్ట. సంప్రదించవలసిన ఫోన్ నెం: 9281474365. [W-1264116]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర॥ 8341479342. [WA-7551]

VEHICLE FOR SALE

■ TS-26-H-1609 Mr. A.Venkanna, Model-2023, Maruthi Swift VXi BS-VI Vehicle for Sale. Cont: Indusind Bank Ltd - 9959343539, 8686863680, 9043990974. [W-1264117]

LOANS

■ స్లాబు, పెంకుటిల్లు, రేకుల కప్పు, టేకోవర్ లోన్స్, అన్ని రకాల వ్యాపారులకు పర్సనల్ లోన్స్, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్ సిబిల్ లేకున్న సిబిల్ బ్యాడ్ వున్న లోన్స్ ఇవ్వబడును. 62816 93271. [M-0983555]

BUSINESS SERVICES

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్స్, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-297]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

■ మా అపార్ట్‌మెంట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, స్వీపర్స్ స్త్రీ/పురుషులు అర్జెంటుగా కావలెను. సంప్ర: 9491710857, 7382106287. [W-1264183]

■ మా ఆఫీసులో పని చేయుటకు అర్జెంటుగా స్త్రీలు కావలెను. Cont: 7382323126. [W-1264182]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. జీతం: 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95027 12418. [M-1256030]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : అధ్యాపకుడిపై దాడి చేసిన ఓ విద్యార్థిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం తెలిపారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన అర్ధ సంవత్సర పరీక్షలు జరుగుతుండగా అధ్యాపకుడు విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గదిలో పరీక్ష రాస్తున్న సదరు విద్యార్థి అల్లరి చేస్తుండగా ఎందుకు చేస్తున్నావని మందలించాడు. దీంతో పరీక్ష రాస్తున్న విద్యార్థి కర్రతో అధ్యాపకుడిపై దాడి చేశాడు. ఈ ఘటనపై అధ్యాపకుడి ఫిర్యాదు మేరకు విద్యార్థిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

దొరికిన చిన్నారి అద్వితి ఆచూకీ

- వేములవాడలో అదృశ్యం.. మహబూబాబాద్‌లో లభ్యం
- రంగంలోకి ఏడు పోలీస్ బృందాలు



అద్విత

సిరిసిల్లక్రైం: వేములవాడ రాజన్న గుడికి తల్లితో పాటు వచ్చిన నాలుగేళ్ల చిన్నారి పది రోజుల క్రితం తప్పిపోగా.. పోలీసులు ముమ్మర గాలింపుతో మహబూబాబాద్‌లో ఆచూకీ లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతలపల్లికి చెందిన సింగారపు లాస్యకు మతిస్థిమితం సరిగా లేదు. ఈక్రమంలోనే తన కూతురు అద్వితతో కలిసి డిసెంబర్ 10న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబీకులు వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. డిసెంబర్ 28న వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చినట్లు లాస్య సోదరుడు పలమారి గంగాస్వామికి తెలియడంతో వెంటనే ఇక్కడికి వచ్చాడు. అయితే అద్విత కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా డు. వేములవాడలోని సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు అద్వితను ఇద్దరు గుర్తుతెలియని మహిళలు అపహరించుకుపోయినట్లు నిర్ధారణకు వచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం ఎస్పీ అఖిల్ మహాజన్ ఏడు పోలీస్ బృందాలను రంగంలోకి దింపి గాలింపు చేపట్టారు. ఈక్రమంలోనే బుధవారం మహబూబాబాద్‌లో అద్విత ఆచూకీ లభ్యమైంది.

దారుణం..

- ఆస్తి కోసం భర్తపై భార్య కత్తితో దాడి
- కుమారులతో కలిసి ఘాతుకం
- బంగ్లాపల్లిలో ఘటన

మొగుళ్లపల్లి: దారుణం. ఆస్తి కోసం భర్తపై భార్య కత్తితో దాడికి పాల్పడింది. కుమారులతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం బంగ్లాపల్లిలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శాపారపు శ్రీనివాస్, కల్యాణి దంపతులకు భరత్, హర్షిత్, బన్నీ ముగ్గురు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్‌కు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. శ్రీనివాస్ బతుకుదెరువు నిమిత్తం పది సంవత్సరాల క్రితం దుబాయ్ వెళ్లాడు. మూడు నెలల క్రితం స్వగ్రామం బంగ్లాపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో అప్పటి నుంచి ఆరు ఎకరాల భూమిని తమ పేరుపై పట్టాచేయాలని భార్యతో పాటు కుమారులు శ్రీనివాస్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ ఘటనపై పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతోపాటు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. అప్పులు చెల్లించిన తర్వాత ఆస్తులు పంపకం చేస్తానని శ్రీనివాస్ చెప్పాడు. దీనికి కుటుంబీకులు ససేమిరా అంటున్నారు. ఈ క్రమంలో బుధవారం భార్య కల్యాణితోపాటు కుమారులు కత్తితో శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాస్ మెడకు తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వాళ్లు గమనించి శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, భార్య కల్యాణితో పాటు ముగ్గురు కుమారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఓసీ–3లో గాయపడిన డ్రైవర్ మృతి



అన్వర్ (ఫైల్)

గణపురం: గణపురం మండల పరిధిలోని కేటీకే ఓసీ–3 గనిలో ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్వర్ మృతి చెందాడు. మట్టిలోడ్ అన్‌లోడ్ చేసి ఓసీ –3 ప్రాజెక్టులోకి వెళ్తున్న క్రమంలో అన్వర్ నడుపుతున్న వోల్వో వాహనం పొగ మంచులో కనపడకుండా అదుపు తప్పి ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అన్వర్‌ను వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజుల నుంచి చికిత్స పొందుతున్న అన్వర్ బుధవారం మృతి చెందారు.

సామాజిక ఉద్యమ కవులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి, తదితరులు

కేయూ క్యాంపస్: డాక్టర్ కత్తి పద్మారావులాంటి సామాజిక ఉద్యమ కవులను స్ఫూర్తిగా తీసుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి కోరారు. బుధవారం హనుమకొండలోని ఆర్ట్సుఅండ్ సైన్స్‌కాలేజీలో తెలుగు విభాగంలో మహాకవి కత్తిపద్మారావు రచించిన 'అస్పృశ్యునియుద్ధగాథ' మూడో గ్రంథాన్ని ఆ కళాశాల ప్రొఫెసర్, ఆ విభాగం అధిపతి డాక్టర్ సదాశివ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడారు. నేటి యువత అభ్యుదయపథంలో సాగాలని కోరారు. డాక్టర్ సదాశివ్ మాట్లాడుతూ మహాకవి, దళిత ఉద్యమకారుడు డాక్టర్ కత్తిపద్మారావు స్వీయ గాథను దళితోద్యమ నేపథ్యంలో మూడు భాగాలుగా తన స్వీయచరిత్రగా రచించారన్నారు. ఈ మూడో గ్రంథాన్ని తన ఆత్మీయ మిత్రుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు ,ఆయన సతీమణి కె. రాజపద్మకు అంకితం ఇవ్వడం గర్వకారణమన్నారు. గ్రంథస్వీకర్త వల్లంపట్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నేటి యువత హేతువాద దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. తనకు ఆ గ్రంథాన్ని అంకితం ఇచ్చిన కత్తిపద్మారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మామిడి లింగయ్య, చింతం ప్రవీణ్, రాజ్‌కుమార్, శ్రీధర్, భిక్షపతి, మ్యాకల సూరయ్య, మేడి సురేశ్ పాల్గొన్నారు.


జిల్లా కళాకారులకు పురస్కారాల ప్రదానం



నాగరాజు గౌడ్‌కు యువపురస్కారం అందజేస్తున్న అతిథులు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ జిల్లాకు చెందిన పద్య, సాంఘిక, పౌరాణిక నాటక కళాకారుడు జూలూరి నాగరాజు గౌడ్ యువపురస్కారం, రంగస్థల కళాకారుడు గూడూరు బాలాజీ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. బుధవారం కరీంనగర్‌లోని కళాభారతి ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ 41వ వార్షికోత్సవ వేడుకల్లో విశిష్టసేవలు అందించిన కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ వై.సునీల్ రావు, 'కుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం అతిథులుగా పాల్గొని రంగస్థల కళాకారుడు జూలూరి నాగరాజు గౌడ్‌కు యువ పురస్కారం, గూడూరు బాలాజీకి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ కళాకారులు దేవరాజు రవీందర్రావు, వనపర్తి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐలోని జాతరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్

ఐనవోలు: సంక్రాంతి సందర్భంగా జరిగే ఐనవోలు మల్లికార్జునస్వామి వారి జాతరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తన నివాసంలో కలిసి ఆయనకు జాతర ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు బహూకరించారు. ఆహ్వానించిన వారిలో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, అర్చకులు పాతర్లపాటి నరేశ్ శర్మ, నందనం భానుప్రసాద్, ఉప్పుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఈఓ నాగేశ్వర్‌రావు.. ఐనవోలు జాతరకు ఆహ్వానించారు.